సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.24,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,500 పలికాయి. మార్కెట్‌కు 233 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



శరవేగంగా ఆస్పత్రి నిర్మాణం

కొత్తచెరువులో రూ.3.02 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రి పనులు శరవేగంగా సాగుతున్నాయి.

IIలో

గరిష్టం/కనిష్టం

34.7°/21.4°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

15లోపు బయోమెట్రిక్ నమోదు చేయించాలి



అనంతపురం రూరల్: 2022– 23 విద్యా సంవత్సరానికి సంబంధించిన మైనార్టీ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో ఈ నెల 15లోపు బయోమెట్రిక్ నమోదు చేయించేలా అన్ని చర్యలూ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను ఉమ్మడి అనంతపురం జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్‌రఫీ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 9, 10 తరగతులతో పాటు ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు మైనార్టీ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, చాలా మంది విద్యార్థులతో ఇప్పటికీ బయోమెట్రిక్ నమోదు చేయించలేదని తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ వీఎల్‌ఈఓలు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో పర్యటిస్తారని, వారి సేవలను ఉపయోగించుకొని ఈ నెల 15లోపు విద్యార్థులతో వంద శాతం బయోమెట్రిక్ నమోదు చేయించి వివరాలను జిల్లా నోడల్ ఆఫీసర్ లాగిన్‌కు పంపించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లపై ఉందని పేర్కొన్నారు.

'ఆరోగ్య సురక్ష'పై 15 నుంచి ప్రచారం



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంపై ఇంటింటి ప్రచారం ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఆయా గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టే తేదీలు ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. వైద్యులు అందుబాటులో ఉండే రోజుల్లో ప్రజలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జగనన్న సురక్ష మెడికల్ క్యాంపులు సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఆలోపు వలంటీర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి 'జగనన్న ఆరోగ్య సురక్ష' గురించి తెలియజేయాలన్నారు. వ్యాధులను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా చికిత్స అందించడం జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. అవసరమైతే రెఫరల్ ఆస్పత్రికి పంపి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

11న అప్రెంటిస్‌షిప్ మేళా

లేపాక్షి: ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థుల కోసం ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎం నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ రాయపురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పరిశ్రమలకు యాజమాన్యాలు ఈ మేళాలో పాల్గొని ఆయా కంపెనీల్లో అప్రెంటిస్‌షిప్‌కు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు 10వ తరగతి, ఐటీఐ మార్కుల జాబితాలు, ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్, రేషన్, పాన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

అభివృద్ధి పరుగు తీయాలి

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం
- కలెక్టరేట్‌లో పెనుకొండ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష
- పెనుకొండను ఆదర్శంగా నిలపాలని ఎమ్మెల్యే శంకరనారాయణ పిలుపు



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: "సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకుని పాలన సాగిస్తున్నారు. అందుకు అనుగుణంగా అధికారులు కూడా పనిచేయాలి. అభివృద్ధి అన్నది ఏ ఒక్కరితోనో జరగదు. అందరూ సమష్టిగా శ్రమిస్తేనే ఫలితం ఉంటుంది. చారిత్రక ప్రాధాన్యత ఉన్న పెనుకొండను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే శంకరనారాయణ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జిల్లా యంత్రాంగం కూడా సహకారం అందించాలి. అభివృద్ధిలో పెనుకొండను ఆదర్శంగా నిలపాలి" అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఎమ్మెల్యే శంకరనారాయణ అధ్యక్షతన పెనుకొండ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి గుమ్మనూరు జయరాం విచ్చేశారు. సమావేశంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, సబ్ కలెక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు మాట్లాడుతూ... పెనుకొండ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులు దృష్టి సారించి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి విషయంలో తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలు అందించడంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అధికారులు అందుకు తగ్గట్టు పనిచేసి సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చూడాలన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు..

ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ... గత పాలకుల నిర్లక్ష్యంతో పెనుకొండ అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పెనుకొండ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా మెడికల్ కళాశాల మంజూరు, నేషనల్ హైవే, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన ఫారెస్ట్ భూములకు సంబంధించి క్లాసిఫికేషన్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నియోజకవర్గంలో 4 సబ్‌స్టేషన్‌ల మంజూరు కోసం సుమారు రూ.13.45 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. పైడేటి, ఎల్‌జీబీ నగర్, రెడ్డిపల్లి గ్రామాలకు సంబంధించి సబ్ స్టేషన్లు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలన్నారు. ఎన్‌హెచ్ 342 నాలుగు లైన్ల జాతీయ రహదారికి రూ.131.857 కోట్లు కేటాయించారని, పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ జలకళకు సంబంధించి విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని, రైతులకు మోటర్లు అందజేయాలని అధికారులకు సూచించారు. కొండకింద ఇస్కాన్ టెంపుల్ నిర్మాణంలో భాగంగా విద్యుత్, నీటి వసతి కల్పించాలన్నారు.

- అనంతరం రూ.600 కోట్లు వ్యయంతో 2.756 టీఎంసీల నీటి సామర్థ్యంతో గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి తీసుకున్న చర్యలు, రూ.2.20 కోట్లతో కొండపైకి విద్యుత్ సరఫరా, పర్యాటకశాఖ ద్వారా వసతి కల్పన చర్యలపై అధికారులతో సమీక్షించారు.
- బి.కొత్తపల్లి–గోరంట్ల రోడ్డు భూసేకరణకు రూ.839.98 కోట్ల కేటాయింపు, గోరంట్ల–హిందూపురం రోడ్డు భూసేకరణకు రూ.808.70 కోట్ల కేటాయింపు, సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితర నిర్మాణ పనులపై సమీక్షించారు. భవన నిర్మాణాలన్నీ త్వరగా పూర్తి చేయాలని కోరారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి చూపాలి

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... పెనుకొండ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధి పనుల్లో పురోగతి చూపాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే సూచనలు, సలహాలను పాటిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.



పెనుకొండ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షకు హాజరైన అన్ని శాఖల అధికారులు

నియోజకవర్గానికి 8,121 ఇళ్లు మంజూరు..

హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అర్బన్ పరిధిలో 6,741 ఇళ్లు మంజూరయ్యాయని, ఆయా నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇక రూరల్ పరిధిలో మంజూరైన 1,380 ఇళ్ల పనులు జరుగుతున్నాయన్నారు. దీంతో పాటు 3,599 ఇళ్ల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ చాంద్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ సతీష్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ మురళీ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత కోసమే జాబ్‌మేళా

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- జాబ్‌మేళాలో 177 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, 'సీడాప్' సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాకు 387 మంది యువతీ యువకులు హాజరు కాగా, 13 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ చేశారు. ప్రతిభ చూపిన 177 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ...ఉద్యోగాలు సాధించిన వారంతా ఉత్తమ పనితీరుతో ఆయా కంపెనీల్లో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అలాగే కుటుంబంతోపాటు మన ప్రాంతానికీ పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షంషాద్‌బేగం, వేముల జయరామిరెడ్డి, తహసీల్దార్ యుగేశ్వరిదేవి, డీఆర్‌డీఏ ఏపీ రామేశ్వర్‌రెడ్డి, ఏపీఎం రఘునాథ్‌రెడ్డి, జేడీఎం సూర్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సుల్లో నాల్గో విడత అడ్మిషన్లు

లేపాక్షి: ఐటీఐ కోర్సుల్లో నాలుగో విడత అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. లేపాక్షిలోని ప్రభుత్వ ఐటీఐతో పాటు జిల్లాలోని 14 ప్రైవేటు ఐటీఐల్లో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల వారు www.iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని లేపాక్షిలోని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాయపురెడ్డి సూచించారు. 20న ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 22వ తేదీ ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

'పురం' రైల్వేస్టేషన్ ఆధునికీకరణ

- రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు
- సౌత్ వెస్ట్రన్ రైల్వే డీఆర్‌ఎం యోగేష్ మోహన్



రైల్వే స్టేషన్ ఆవరణలో ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం అర్బన్: 'అమృత్ భారత్ స్టేషన్' పథకంలో భాగంగా హిందూపురం రైల్వే స్టేషన్‌లో అధునాతన సౌకర్యాలు కల్పించనున్నట్లు సౌత్ వెస్ట్రన్ రైల్వే (బెంగళూరు) డీఆర్‌ఎం యోగేష్ మోహన్ తెలిపారు. రూ.15 కోట్లతో స్టేషన్‌లో లిఫ్ట్, కోచ్ స్టాపింగ్ సిగ్నల్ బోర్డులు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి హిందూపురం రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. రైల్వే ఆస్పత్రి, రన్నింగ్ రూం, ఉన్నతాధికారులు, లోకో పైలెట్ల విశ్రాంతి గదులు, రైల్వే పాఠశాలను పరిశీలించారు. రైల్వే స్టేషన్ రెండో ద్వారాన్ని ఏర్పాటు చేసి అక్కడే ఆటోమేటిక్ టికెట్ వెడింగ్ మిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం స్టేషన్ ఆవరణలో మినరల్ వాటర్ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొంగు, సంపర్ క్రాంతి, రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు హిందూపురం రైల్వే స్టేషన్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని, యశ్వంతపూర్ –హిందూపురం మధ్య నడిచే ప్యాసింజర్ రైలును అనంతపురం వరకూ నడపాలని పలువురు ప్రయాణికులు డీఆర్‌ఎంను కోరారు. డీఆర్‌ఎం వెంట సీనియర్ డీసీఎం కృష్ణ చైతన్య, సీనియర్ డీఓఎం ఏఎన్ కృష్ణారెడ్డి, డీఈ పూజ, స్టేషన్ మాస్టర్ జయప్రకాష్, సోమన్న, కిరణ్, జ్యోతి, నారాయణప్ప సిబ్బంది ఉన్నారు.

సౌకర్యాలు కల్పించండి: టీఎన్ దీపిక..

హిందూపురం రైల్వేస్టేషన్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక సౌత్ వెస్ట్రన్ రైల్వే డీఆర్‌ఎం యోగేష్ మోహన్‌ను కోరారు. ఈ మేరకు ఓ వినతి పత్రం సమర్పించారు. విజయవాడ వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం యశ్వంతపూర్ – కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను రోజూ నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దివ్యాంగుల సౌకర్యార్థం లిఫ్ట్, కోచ్ పోజిషన్ డిస్‌ప్లే బోర్డు, వృద్ధులు, దివ్యాంగులు ప్లాట్‌ఫారాలు దాటడానికి వీలుగా ఎస్కలేటర్, ప్రస్తుతం స్టేషన్‌లో ఉన్న 5 కేవీ జనరేటర్ స్థానంలో 25 కేవీ జనరేటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట కౌన్సిలర్లు షాజియా, శివ, పార్వతి, మల్లికార్జున, చంద్ర, నాగరాజు, నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, చాంద్‌బాషా, కవిత, వెంకటేష్‌రెడ్డి, పరమేష్‌రెడ్డి, ఫరూక్, రాము తదితరులు ఉన్నారు.

'భవిత'కు భరోసా

- ప్రత్యేక అవసరాల పిల్లలపై సర్కారు 'ప్రత్యేక' దృష్టి
- భవిత కేంద్రాల్లో ఖాళీ ఐఈఆర్పీ పోస్టుల భర్తీకి చర్యలు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 42 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- ఈ నెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు



భవిత కేంద్రం

రాప్తాడు రూరల్: ప్రత్యేక అవసరాల పిల్లల భవితకు ప్రభుత్వం భరోసా ఇస్తోంది. భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక విద్య బోధిస్తున్నారు. ఇటీవలే భవిత కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లోకి విలీనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాధారణ విద్యార్థులతో కలిసి ఉండడం వల్ల ప్రత్యేక అవసరాల పిల్లల్లో మరింత మార్పు వస్తుందనే ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక పిల్లలకు శిక్షణ ఇచ్చే ఇన్‌క్లూజిట్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ) పోస్టుల భర్తీపై దృష్టి సారించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 126 పోస్టులు ఉండగా... 84 మంది కాంటాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. ఖాళీగా ఉన్న మరో 42 పోస్టుల భర్తీకి తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఖాళీ పోస్టుల్లో 15 ఎంఆర్, 27 హెచ్ఐ/వీఐ పోస్టులు ఉన్నాయి. రోస్టర్‌ను అనుసరించి ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తం 100 మార్కులతో మెరిట్ జాబితాను తయారు చేస్తారు. ఇందులో 85 మార్కులు ఇంటర్, డిగ్రీ, పీజీ, స్పెషల్ ఎడ్యుకేషన్, గతంలో ఐఈఆర్పీలు పని చేసి ఉంటే సర్వీసును పరిగణనలోకి తీసుకుని కేటాయిస్తారు. తక్కిన 15 మార్కులకు స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు.


రాష్ట్రస్థాయిలోనే ఎంపిక..

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను రాష్ట్రస్థాయిలో అధికారులు పరిశీలించి మెరిట్ జాబితా తయారు చేస్తారు. ఒక పోస్టుకు ఐదుగురు చొప్పున ఎంపిక చేసి ఆ జాబితాను ఈ నెల 23న జిల్లాలకు పంపుతారు. ఈ జాబితాపై ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లా అధికారులు అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటిన్నింటినీ పరిశీలించి 27న తుదిజాబితాను తయారు చేస్తారు. 28 నుంచి 30 వరకు జిల్లాస్థాయి కమిటీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. అక్టోబరు 3 నుంచి 5 వరకు స్కిల్‌టెస్ట్ నిర్వహిస్తారు. 6న తుది ఎంపిక జాబితాను ప్రకటిస్తారు. 7న నియామక ఉత్తర్వులు అందజేస్తారు. 9, 10 తేదీల్లో కాంటాక్ట్ అగ్రిమెంట్ తీసుకుంటారు. 11న విధుల్లో చేరాల్సి ఉంటుంది.

ఇవీ విద్యార్హతలు..

- సాధారణ బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఆర్‌సీఐ (రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) గుర్తింపుతో స్పెషల్ బీఈడీ చేసి ఉండాలి.
- లేదా సాధారణ బ్యాచిలర్ డిగ్రీతో పాటు జనరల్ బీఈడీ, ఏడాది డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి.
- లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు జనరల్ బీఈడీ, రెండేళ్ల డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఆర్‌సీఐ గుర్తింపు పొంది ఉండాలి.
- లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు జనరల్ బీఈడీ, పీజీ ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఆర్‌సీఐ గుర్తింపు పొంది ఉండాలి.
- ఇంటర్‌తో పాటు డీఎడ్ ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఆర్‌సీఐ నుంచి గుర్తింపు పొందిన ధ్రువపత్రం ఉండాలి.

పారదర్శకంగా పోస్టుల భర్తీ



ప్రత్యేక అవసరాల పిల్లల విద్య బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఖాళీగా ఉన్న ఐఈఆర్పీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 42 పోస్టులు భర్తీ చేస్తున్నాం. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రాష్ట్రస్థాయిలోనే ఎంపిక జాబితాను తయారు చేస్తారు. పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. – వి.నాగరాజు సమగ్రశిక్ష ఏపీసీ

తాగునీటి అవసరాలకే ప్రాధాన్యం

- ఐఏబీ సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యేలు శంకరనారాయణ, సిద్దారెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, జేసీ చేతన్ తదితరులు

పుట్టపర్తి అర్బన్: నీటివనరుల వినియోగంలో తాగునీటి అవసరాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా నీటి పారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించారు. పెనుకొండ, కదిరి, మడకశిర ఎమ్మెల్యేలు శంకరనారాయణ, సిద్దారెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జేసీ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, హంద్రీనీవా ఎస్‌ఈ దేశానాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు, యోగి వేమన జలాశయం, పెన్నార్ కుముద్వతీ ప్రాజెక్టుల కింద 29,054 ఎకరాల ఆయకట్టు, 2.65 టీఎంసీల నీటి సామర్థ్యం ఉందన్నారు. అదేవిధంగా చిన్న నీటిపారుదల చెరువుల కింద 83,486 ఎకరాల ఆయకట్టు, 15.32 టీఎంసీల నీటి సామర్థ్యం ఉందన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టులో అంతర్భాగమైన చెర్లోపల్లి జలాశయం ద్వారా మడకశిర, పుంగనూరు ఉపకాలువలకు, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలకు నీటిని విడుదల చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు కచ్చితంగా అమలు చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు.

- జిల్లా సరిహద్దులో ఉన్న మడకశిర నియోజకవర్గానికి కీలకమైన మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు అక్టోబర్ 16వ తేదీలోపు గొల్లపల్లి జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కోరారు.
- చెరువుల్లోనూ పూడిక తీత పనులు పూర్తి చేసి హంద్రీనీవా ద్వారా చెరువులకు నీళ్లు నింపే కార్యాచరణను అమలు చేయాలని పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ సూచించారు. జీడిపల్లి జలాశయం నుంచి ఫేజ్–2 కింద ఈనెల 18 వతేదీన నీటిని విడుదల చేసేలా సమావేశంలో నిర్ణయం తీసుకోవాలన్నారు.
- చెర్లోపల్లి, పుంగనూరు జలాశయాల ఉపకాలువలకు హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ నుంచి అక్టోబర్ 18 వ తేదీన నీటిని విడుదల చేసేలా కమిటీలో తీర్మానం చేయాలని కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఇంజినీర్లు గంగాధర్ గౌడ్, మురళీ, రాజశేఖర్, నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి..

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే ప్రకృతి సేద్యం వైపు రైతులంతా దృష్టి సారించేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ... రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నారన్నారు. జిల్లా యంత్రాంగం కూడా ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఖరీఫ్‌లో వర్షాలు సకాలంలో కురవక ప్రధాన పంటలు సాగు చేయలేని రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు అందజేయాలన్నారు. రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన సేవలను అందించేలా సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి..



రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని జెడ్పీ సమావేశాల్లో ప్రజా ప్రతినిధుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ అన్నారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన ఆర్బీకేల్లో సిబ్బంది అందరూ అందుబాటులో ఉంటూ రైతులకు మెరుగైన సేవలందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... నికర ఆదాయాన్నిచ్చే పంటల గురించి రైతులకు అవగాహన కల్పించి వాటిని సాగుచేసేలా ప్రోత్సహించాలన్నారు. అలాగే నీటి వనరులను వినియోగం మెరుగుపడేలా చూడాలన్నారు. ప్రతి నెలా జిల్లా వ్యవసాయ సలహా మండల సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ, కదిరి, మడకశిర ఎమ్మెల్యేలు శంకరనారాయణ, సిద్దారెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, జేసీ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పతనమైన టమాట ధర

అనంతపురం అగ్రికల్చర్: మార్కెట్‌లో టమాట ధరలు పతనమవడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా, పక్కనున్న కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున సరుకు వస్తోంది. నెల కిందట కక్కలపల్లి మార్కెట్‌లో 500 టన్నులలోపు టమాటాలు రావడంతో గిట్టుబాటు ధరలు లభించాయి. ఇటీవల 2వేల నుంచి 5 వేల టన్నుల వరకు మార్కెట్‌కు వస్తుండటంతో అమ్మకాలు పూర్తిగా మందగించాయి. శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8.50 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. కనిష్టం రూ.2, సరాసరిన రూ.5 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయన్నారు.

క్లుప్తంగా

యువతి కథ సుఖాంతం


ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఎదుట యువతిని హాజరుపరిచిన పోలీసులు

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట కాలనీకి చెందిన రంగమ్మ, నాగన్న దంపతుల మొదటి కుమార్తె లలిత గత నెల 29న మడకశిరలోని కాలేజీ వెళ్లి వస్తానని చెప్పి ఇంటికీ రాకుండా అదృశ్యమైంది. ఈ ఘటనపై లలిత తల్లి రంగమ్మ ఈనెల 2న రొళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు గాలించినా ఫలితం లేకపోయింది. అయితే ఎట్టకేలకు ఆ యువతి నేరుగా పోలీస్ స్టేషన్‌కు రావడంతో కథ సుఖాంతమైంది. కుటుంబ సభ్యులు కొన్ని విషయాలపై తనను మందలించడంతో చెప్పా పెట్టకుండా ఇంటి నుంచి వెళ్లి కర్ణాటక రాష్ట్రం బరగూరులోని బంధువుల ఇంట్లో ఉన్నానని లలిత పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్‌ఐ వెంకటరమణ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఎదుట హాజరు పరిచి తర్వాత లలితను తల్లిదండ్రులకు అప్పగించారు.

ఎద్దుల బండిని ఢీ కొట్టిన బస్సు


ప్రైవేటు బస్సు ఢీ కొనడంతో బోల్తా పడిన ఎద్దుల బండి

బత్తలపల్లి: అనంతపురం – కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని రామాపురం వద్ద శుక్రవారం ఎద్దుల బండిని ఓ ప్రైవేటు బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో రైతుతో పాటు రెండు ఎద్దులు గాయపడ్డాయి. పోలీసుల వివరాలమేరకు. మండలంలోని రామాపురంకు చెందిన హనుమంతరెడ్డి స్థానికంగా ఉన్న చిత్రావతి నదిలోకి ఇసుక తీసుకువచ్చేందుకు ఎద్దుల బండిలో వెళ్తున్నారు. రామాపురం క్రాస్‌లో ఎద్దుల బండి రోడ్డు మీదకు రాగానే అనంతపురం నుంచి తిరుపతికి వెళ్తున్న ప్రైవేటు బస్సు ఎద్దుల బండిని వెనుక నుంచి ఢీ కొంది. దీంతో ఎద్దుల బడి ఎగిరిపడి బోల్తా పడింది. హనుమంతరెడ్డితో పాటు ఎద్దులు గాయపడ్డాయి. చికిత్స నిమిత్తం హనుమంతరెడ్డి ఆస్పత్రికి తరలించారు. 1962 పశువుల అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో పశువైద్యులు గుర్నాథరెడ్డి, దివ్యసాయితో పాటు గోపాలమిత్రులు అక్కడికి చేరుకుని పశువులకు వైద్యం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బస్సును అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు.

శరవేగంగా ఆస్పత్రి నిర్మాణం

- కొత్తచెరువులో 30 పడకలతో ఆస్పత్రి భవనాల నిర్మాణం
- రూ.3.02 కోట్లతో పనులు

కొత్తచెరువు: పేద ప్రజలకు మంచి వైద్యం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగానే కొత్తచెరువులో 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేశారు. ప్రస్తుతం శరవేగంగా ఆస్పత్రి భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్..

పుట్టపర్తి నియోజకవర్గంలో కొత్తచెరువు కేంద్ర బిందువుగా ఉంది. కొత్తచెరువుతో పాటు బుక్కపట్నం, పుట్టపర్తి, సీకే పల్లి తదితర మండలాల నుంచి ఇప్పటికే రోగులు కొత్తచెరువులో 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయిన ఆస్పత్రికి వస్తున్నారు. రోగులకు అన్ని వైద్య సదుపాయాల కల్పించాలన్న లక్ష్యంతో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కొత్తచెరువులో 30 పడకలతో నూతన భవన నిర్మాణాలకు రూ.3.02 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఇందులో భాగంగానే ఆస్పత్రిని నిర్మిస్తున్నారు. కొత్తచెరువులో 30 పడకల ఆస్పత్రి భవనం పూర్తయితే జిల్లా స్థాయి ఆస్పత్రిగా రూపుదిద్దుకోనుంది. కొత్తచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇప్పటికే 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ కావడంతో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రతిరోజూ ఈ ఆస్పత్రిలో వివిధ ప్రాంతాల నుండి 200లకు పైబడి ఓపీ సేవలను అందిస్తున్నారు.


కొత్తచెరువులో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆస్పత్రి

అన్ని రకాల జబ్బులకు పరీక్షలు..

నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రి పూర్తయితే కంటి, చిన్నపిల్లలు, గైనకాలజిస్ట్, సివిల్ సర్జన్ తదితర జబ్బులకు సంబంధించి 8 రకాల ప్రత్యేక వైద్యనిపుణులతో పాటు 39 మంది వైద్య సిబ్బందిని నియమించనున్నారు. చిన్న పిల్లలకు సంబంధించి నిమోనియా, డెంగీ, పిల్లల ఎదుగుదల, ఝూండీస్ వంటివేకాకుండా సర్జరీలకు సంబంధించి హెర్నియా, థైరాయిడ్, దంతాలకు సంబంధించి రూట్ కెనాల్ దంత చికిత్సలతో పాటు అన్నిరకాల జబ్బులకు సంబంధించిన పరీక్షలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటి వరకు ఏదైనా కారణంగా మృతి చెందిన వారికి పోస్టుమార్టం నిర్వహించాలంటే పెనుకొండ, ధర్మవరం ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. నూతన భవనాల నిర్మాణం పూర్తయితే ఇక్కడే పోస్టుమార్టం చేసే వీలుంటుందని వైద్యులు చెబుతున్నారు.

మెరుగైన వైద్య సేవలు



30 పడకల ఆస్పత్రి భవనం పూర్తయితే కార్పొరేట్ స్థాయిలో అన్ని జబ్బులకు ఇక్కడే వైద్యం అందుతుంది. జిల్లాలో ఎంతో సాకర్యవంతంగా ఈ ఆస్పత్రిని నిర్మించడం జరుగుతోంది. పేదలకు ఎలాంటి ఫీజు లేకుండా ప్రభుత్వం ఖరీదైన వైద్యాన్ని పూర్తిస్థాయిలో ఉచితంగానే అందిస్తుంది.

– అశ్వర్థకుమార్, సివిల్ సర్జన్

దోరణాలపల్లిలో చోరీ

చిలమత్తూరు: మండలంలోని దోరణాలపల్లిలో నరసింహప్ప అనే వృద్ధుడి ఇంట్లో ఈనెల 5న రాత్రి 3.8 తులాల బంగారం, నగదు చోరీకి గురైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు నరసింహప్ప ఫిర్యాదు చేశారన్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ నరసింహప్ప 5న బంధువులకు సంబంధించిన సీమంతం కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లాడన్నారు. తిరిగి మరుసటిరోజు ఇంటికి వచ్చేసరికి తలుపులకు ఉన్న తాళం తెరచి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా 3.8 తులాల బంగారం, నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. క్లూస్ టీం ఇప్పటికే వేలిముద్రలు సేకరించిందని, త్వరలోనే కేసు ఛేదిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ఏపీ అండర్-19 జట్టుకు ఆర్షియా ఎంపిక


ఎస్.ఆర్షియా

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎస్. ఆర్షియా ఏపీ అండర్-19 జట్టుకు ఎంపికైంది. కదిరి పట్టణానికి చెందిన ఆర్షియా కుడి చేతి ఓపెనర్ బ్యాటర్‌గా రాణిస్తున్నారు. ఆర్షియా ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఆంధ్రా సౌత్ జోన్ టీంలో అర్ధ సెంచరీ, జిల్లా స్థాయి పోటీల్లో ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీ చేశారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో సెప్టెంబర్ 10 నుంచి 20వ తేదీ వరకు ఆరు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో పాల్గొననున్నారు. కదిరి క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో కోచ్ నజీర్ అహమ్మద్ పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంటున్నట్లు ఆర్షియా తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరుపున ఎస్. ఆర్షియాకు యుగంధర్‌రెడ్డిని అసిస్టెంట్ క్రికెట్ కోచ్‌గా నియామించినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కే. మధు ఆచారి తెలిపారు.

కల్తీ కల్లు బాధితులకు పరామర్శ

- ఘటనపై ఆరా తీసిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి
- విచారణ ముమ్మరం

పెనుకొండ: పెనుకొండ మండం బండపల్లి, నాగలూరు గ్రామాల్లో కల్లు తాగి 29 మంది అస్వస్థతతకు గురైన ఘటనపై లోతుగా విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ (విజిలెన్స్) శ్రీలత పేర్కొన్నారు. శుక్రవారం నాగలూరు, బండపల్లి గ్రామాలను కమిషనర్ సందర్శించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు. వైద్యులు మాట్లాడుతూ వాంతులు, విరేచనాలతో 16 మంది అడ్మిట్ కాగా అందులో 15 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఒక వృద్ధుడిని మాత్రం అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేశామన్నారు. హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రిలో సైతం 13 మంది చికిత్స నిమిత్తం చేరినట్లు అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి రాగా.. వారి ఆరోగ్య పరిస్థితిని సైతం ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ ఘటనకు కారణాలను ఆరా తీసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.


పెనుకొండ ప్రభుత్వాస్పత్రిలో కల్తీ కల్లు బాధితులను పరామర్శిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీలత

అనంతరం ఆమె బండపల్లి, నాగలూరుల్లోని కల్లు దుకాణాలను పరిశీలించి శాంపిల్లను సేకరించారు.

ఉప ముఖ్యమంత్రి ఆరా..

మండలంలోని నాగలూరు, బండపల్లి గ్రామాల్లో కల్లు తాగి 39 మంది అస్వస్థతకు గురైన ఘటనపై విదేశాల్లో ఉన్న ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్‌శాఖామంత్రి నారాయణస్వామి జిల్లా ఎక్సైజ్ అధికారులతో ఆరా తీశారు. బాధితుల మెరుగైన వైద్యం అందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

మరో ఏడుగురు ఆస్పత్రికి..

పెనుకొండ రూరల్: కల్తీకల్లు ఘటనలో శుక్రవారం మరో 7 మంది ఆస్పతిలో చేరారని డాక్టర్ తేజ తెలిపారు.

ఏడేళ్ల తర్వాత హత్య కేసు ఛేదింపు

- కటకటాల వెనక్కి ముద్దాయి రామచంద్ర
- ఆర్థిక లావాదేవీలే కారణమన్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: నల్లమాడ పోలీసుస్టేషన్ పరిధిలో 7 సంవత్సరాల క్రితం అదృశ్యమైన మహిళ హత్య కేసును నల్లమాడ పోలీసులు ఛేధించి నిందుతుడి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి వెల్లడించారు. నల్లమాడ మండలం పెనుమకుంటపల్లి తండాకు చెందిన వడిత్యా జివిలీబాయ్ (45) అనే మహిళకు ముదిగుబ్బ మండలం మక్తాపురంకు చెందిన బాబునాయక్‌తో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కొద్ది రోజులకు అనారోగ్యంతో బాబూనాయక్ చనిపోయారు. అయితే జివిలీబాయ్ బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన మంగలి రామచంద్ర (52)తో సహజీవనం చేస్తూ ఇద్దరు ముదిగుబ్బ మండలం సంకేపల్లి సమీపంలో మామిడితోటకు కాపాలాగా ఉంటున్నారు. అయితే జివిలీబాయ్ బతుకుదెరువు కోసం కేరళకు వెళ్లివచ్చి పిల్లలను పోషించుకొనేది. ఈ క్రమంలో 2016 ఆగస్టు 7న కేరళ నుంచి నల్లమాడకు వచ్చి అక్కడ నుంచి సంకేపల్లిలోని మామిడితోటలో ఉన్న రామచంద్రను కలవడానికి వెళ్లింది. అప్పటి నుంచి జివిలీబాయ్ కనిపించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నల్లమాడ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పాత కేసుల పురోగతిలో భాగంగా డీఎస్పీ వాసుదేవన్ పర్యవేక్షణలో సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో అనుమానితుడైన మంగళి రామంచంద్రను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆర్థిక లావాదేవీల కారణంగా జివిలీబాయ్‌ను కక్రతో కొట్టి చంపేసి మామిడితోటలో పూడ్చిపెట్టినట్లు ఒప్పుకున్నాడు. శవాన్ని పూడ్చిన స్థలం చూపించారు. దీంతో శవాన్ని బయటకు తీయించి డీఎన్ఏ ఆధారంగా పరిశీలించి ముద్దాయిని అరెస్ట్ చేసి రిమండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తో పాటు కానిస్టేబుళ్ల నాగరాజు, నరసింహులు, నరేశ్‌లను ఎస్పీ మాధవరెడ్డి అభినందించి ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతులు అందజేశారు.


మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

నిందితులను వదిలిపెట్టం..

ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ తప్పు చేసిన నిందితులు చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. కేసులను త్వరతగతిన విచారణ జరిపి నిందితులకు శిక్షపడేలా చూస్తామన్నారు. పుట్టపర్తి పట్టణంలో జరిగిన చైన్‌స్నాచింగ్‌లు, సిరిగంధం చెట్టు నరికిన సంఘటనలపై కూడా దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వాసుదేవన్, సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్, ఎస్‌బీ సీఐ రవీంద్రనాథ్, డీసీఆర్‌బీ సీఐ సుబ్బారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


రాఘవ (ఫైల్)

కదిరి అర్బన్: మండల పరిధిలోని మొటుకుపల్లి సమీపంలో శుక్రవారం తలుపుల మండలం బట్రేపల్లికి చెందిన రాఘవ (21) అనే యువకుడు హిటాచీ వాహనానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న స్థానికులు చూసి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ బాబ్జాన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బట్రేపల్లికి చెందిన బాలకృష్ణ, ప్రమీల దంపతులకు నలుగురు పిల్లలు. ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు కుమారులు. రాఘవ ఆఖరివాడు. విగతజీవునిగా పడివున్న కుమారున్ని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. రాఘవ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అనుమతుల్లేని కల్లు దుకాణాలపై చర్యలు


కల్లు దుకాణంలో నమూనాలు సేకరిస్తున్న సెబ్ అధికారులు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా కల్లు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ , ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం సెబ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆరు బృందాలుగా ఏర్పడి పెనుకొండ రూరల్ పరిధిలో శెట్టిపల్లి, గొల్లపల్లి, పెనుకొండ, దుద్దేబండ, మనిమడుగు, కొండంపల్లి, కురుబవాండ్లపల్లి గ్రామాల్లోని కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించారు. నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం చిత్తూరు ల్యాబ్‌కు పంపారు. అనుమతులు లేకుండా కల్లు దుకాణాలు నిర్వహించినా, మత్తు పదార్థాలు కలిపినా క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని వారు హెచ్చరించారు. లైసెన్స్‌దారుని మీద పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. సెబ్ సీఐ నరసింహులు, అన్నపూర్ణ, సుబ్బారెడ్డి, ఎస్‌ఐలు రహన, జేబీఉల్లా, నారాయణ, నరేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఉట్లమానోత్సవం


ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

కదిరి టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి తూర్పురాజగోపురం ముందు శుక్రవారం సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహించారు. కొలేపల్లికి చెందిన గొల్ల యువకులు ఉట్టి కొట్టేందుకు, ఉట్లమాను ఎక్కేందుకు ఉత్సాహంగా పోటీపడ్డారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభునికి తీరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా జూనియర్ బాల, బాలికల ఫుట్‌బాల్ జట్లు

హిందూపురం టౌన్: జిల్లా అండర్-17 బాల, బాలికల ఫుట్‌బాల్ జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. స్థానిక ఎంజీఎం క్రీడామైదానంలో జరిగిన ఎంపిక పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీ పడ్డారు. ప్రతిభ చూపిన వారిలో అండర్-17 బాలికల జట్టుకు 20 మందిని, బాలుర జట్టుకు 20 మందిని ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపికైన జట్లు త్వరలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ సలీమ్, కోశాధికారి శేఖర్, పీడీలు లోకనాథ్, రామాంజనేయులు, కోచ్‌లు బాలాజీ, రాజ్ మిశ్రా, బాలాజీ, మౌనిక, చంద్ర, వెంకట్, విలియమ్స్, హర్ష, గిరి, మహబూబ్‌బాషాలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఏబీపల్లి తండాలోని నారూ నాయక్ ఇంటి వెనుక ఖాళీ ప్రదేశంలో నిల్వ ఉంచిన 210 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం అనంతపురం ప్రాంతీయ నిఘా అమలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని సీఎస్‌డీటీ మునిస్వామికి అప్పజెప్పారు. పాల్తే రమేష్ నాయక్, ఇస్లావత్ రామాంజినాయక్‌లను అదుపులోకి తీసుకొని ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐలు శేషగిరి, జయపాల్‌రెడ్డి, ఫణీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం


సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని చేయిస్తున్న అర్చకులు


వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు

కదిరి టౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో (కళ్యాణ వేదిక) స్టేజ్‌పైన అమ్మవారి ఉత్సవ మూర్తిని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 200 మంది మహిళలతో వరలక్ష్మీ వ్రతాన్ని చేయించారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధిచార్యులు, ముఖ్య అర్చకులు అంజన్‌కుమార్ స్వాములచే శాస్త్ర నియామల ప్రకారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో మడకశిరకు కృష్ణా జలాలు

మడకశిర: మడకశిర నియోజకవర్గానికి వచ్చే అక్టోబర్ 16న కృష్ణా జలాలను అధికారులు విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు తిప్పేస్వామి తెలిపారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడుతూ అక్టోబర్ 16న కృష్ణాజలాలను గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి అధికారులు విడుదల చేస్తారన్నారు. తొలుత కృష్ణా జలాలను నేరుగా మడకశిరకు తీసుకువస్తారని పేర్కొన్నారు. ఆతర్వాత అమరాపురం మండలానికి తీసుకెళ్తారన్నారు. బైపాస్ కెనాల్ పనులు కూడా వచ్చే నెలలో ప్రారంభమవుతాయని తెలిపారు.


ఆంజనేయస్వామి విగ్రహ శిలను ఊరేగిస్తున్న దృశ్యం


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఘనంగా విగ్రహ శిల ఊరేగింపు

హిందూపురం: హిందూపురంలోని సూగూరు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద 44 అడుగుల అభయాంజనేయస్వామి ఏకశిల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే కర్ణాటక మధుగిరి సమీపంలోని కొండ ప్రాంతాల నుంచి 500 టన్నుల భారీ కొండరాతిని ముందుగా పరిగి రోడ్డులో వద్ద నిలిపారు. అక్కడ విగ్రహ దాత వై.చంద్రశేఖర్‌తో పాటు ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి బెంగళూరు రోడ్డు సూగురు ఆంజనేయస్వామి ఆలయం వరకు వందలాది మంది భక్తుల మధ్య ఊరేగించారు. దారిపొడువునా ప్రజలు ఆంజనేయస్వామి విగ్రహ శిలకు పూజలు చేసి టెంకాయలు కొట్టి స్వాగతం పలికారు.